## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అవుకు: మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో శనివారం కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శనివారం కృష్ణుడి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధా సేవా సమితి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, యువ నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అవుకు పట్టణంలో ఆదివారం శ్రీకృష్ణుడి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ఇందూజ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి ఉప్పలపాడు కమిటీ సభ్యులు గణపతి, చిన్న బాల పెద్దయ్య, రాజశేఖర్, వంట రాముడు, మురళి తదితరులు పాల్గొన్నారు.

### త్వరలో బెలుం బైపాస్ రోడ్డు పనుల ప్రారంభం

కొలిమిగుండ్ల: ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం చూపేందుకు బెలుంలో బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవతో డీఎంఎఫ్ కింద రూ.1.25 కోట్లు మంజూరు చేయించారు. రెండు రోజుల క్రితమే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. బెలుం గుహల నుంచి ఎస్సీ కాలనీ మీదుగా వెళ్లి నేరుగా బెలుం శింగవరంలో రోడ్డులో బైపాస్ కలువనుంది. ఈరోడ్డు పూర్తయితే బెలుంలో చాలా వరకు ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. బెలుం, బెలుం శింగవరం గ్రామాల్లో నాపరాతి గనులు అధికంగా ఉన్నాయి. ప్రతి రోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, లారీల్లో నాపరాళ్ల రవాణా జరుగుతుంటుంది. వీటికితోడు కోవెలకుంట్ల, బనగానపల్లె, నంద్యాల, ఆళ్లగడ్డ పట్టణాలకు వెళ్లేందుకు చాలా మంది ఈమార్గం మీదుగానే వెళ్తున్నందున సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలు గుర్తించిన ఎమ్మెల్యే కాటసాని,జెడ్పీచైర్మన్ బైపాస్ రోడ్డు మంజూరు చేయించారు.

### విగ్రహం ఏర్పాటు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలోని డోన్ క్రాస్ రోడ్డులో ఉన్న డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం రహదారి విస్తరణ పనులకు అడ్డంగా ఉండటంతో పక్కనే నగర పంచాయతీ అధికారులు స్థలం కేటాయించారు. ఈ మేరకు విగ్రహం ఏర్పాటుకు జరుగుతున్న ఫౌండేషన్ పనులను శనివారం ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి పరిశీలించారు. పనులు జాగ్రత్తగా చేపట్టాలని కులసంఘాల నాయకుడు రాజయ్యకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, నడ్డి శ్రీను, బాలశేఖర్ పాల్గొన్నారు.

### 12న మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక

బనగానపల్లెరూరల్: మండల స్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ స్వరూప శనివారం తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని నెహ్రూ స్కూల్ క్రీడా మైదానంలో జరిగే ఈ ఎంపికకు అండర్–14, 17 బాల, బాలికల క్రీడాకారులతోపాటు ఆయా పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్‌బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, ఖోఖో, త్రోబాల్, యోగా తదితర తొమ్మిది క్రీడాంశాలలో టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ ఉంటాయని ఎంఈఓ తెలిపారు.

### 13, 14 తేదీల్లో క్రీడా పోటీలు

ప్యాపిలి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 13, 14 తేదీల్లో అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల క్రీడల సమన్వయకర్త సునీల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి టోర్నమెంట్ కం సెలక్షన్లుగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో బాల్ బ్యాడ్మింటన్, షటిల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, వాలీబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెట్స్ తదితర పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి క్రీడాకారులు దరఖాస్తు ఫారాన్ని భర్తీ చేసి ఈ నెల 12 వ తేదీలోపు అందజేయాలన్నారు. అండర్ 19లో నేరుగా జిల్లా స్థాయిలో జరుగుతాయన్నారు. అండర్ 19లో ఇంటర్ మీడియట్ విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

# అవినీతికి పాల్పడినందునే... బాబు అరెస్టు

- 2014లో అధికారం చేపట్టిన రెండు నెలలకే స్కాంకు చంద్రబాబు వ్యూహం
- ఈ అవినీతిపై జీఎస్టీ, ఇంటెలిజన్సీ, ఐటీ, ఈడీ, సెబి ఏజన్సీలు సైతం దర్యాప్తు
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.371 కోట్ల అవినీతికి పాల్పడినట్లు పక్కా ఆధారాలు ఉన్నందునే సీఐడీ అధికారులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టు చేశారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. ఈ అవినీతిపై జీఎస్టీ, ఇంటెలిజెన్సీ, ఐటీ, ఈడీ సెబీ ఏజెన్సీలు సైతం దర్యాప్తు చేశాయని స్పష్టం చేశారు. పట్టణంలోని స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడుతూ 2014లో అధికారం చేపట్టిన రెండు నెలలకే ఈ స్కాంకు చంద్రబాబు వ్యూహం రచించారని ఆరోపించారు. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు రూ.3,356 కోట్లతో సీమెన్స్ కంపెనీ ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. ఇందులో ప్రభుత్వ వాటా 10 శాతం ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్టు పనితీరు ఏ మాత్రం ముందుకు కదలలేదని, అయితే ప్రభుత్వం మాత్రం 10 శాతం వాటాగా రూ.371 కోట్లను ఐదు విడతలుగా విడుదల చేసిందన్నారు. ఈ చర్య విరుద్ధమంటూ ఆర్థికశాఖ అధికారులు సూచించినా ముఖ్యమంత్రి హోదాలో బాబు స్వయంగా ఆ ఫైల్‌ను తెప్పించుకుని సంతకం చేసి నిధులు విడుదల చేయించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో దోచుకున్న సొమ్మును హవాలా సెల్ కంపెనీ ద్వారా చంద్రబాబుకు చేరిందని ఆరోపించారు. ఈ విషయాన్ని అధికారులేకాక సీమెన్స్ సంస్థ కూడా ఇంటర్నల్ దర్యాప్తు జరిపి 164 సీఆర్‌పీసీ సెక్షన్ ప్రకారం ఏకంగా కోర్టులో చెప్పడం జరిగిందన్నారు. ఈ స్కాం గురించి ఓ అజ్ఞాత వ్యక్తి రాత పూర్వకంగా ఏసీబీకి ఫిర్యాదు చేయగా 2018లో చంద్రబాబుకు కేంద్ర సంస్థ హెచ్చరికలు జారీ చేసి విచారణ ప్రారంభించిందన్నారు. అయితే చంద్రబాబు అడ్డుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపించారు. ఇది జరిగిన మరుక్షణమే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నోటు ఫైల్‌ను చంద్రబాబు మాయం చేశారన్నారు. బాబుపై లక్షల కోట్ల స్కాంలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ స్టేలు పొందుతూ కుట్రరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, ఎవరెస్టుబాబు, అత్తార్‌జాహెద్ హుస్సేన్, అబ్దుల్‌ఫైజ్, శంకర్‌రెడ్డి, భానుముక్కల సింగల్‌విండో అధ్యక్షుడు నీలిశ్రీనివాసులు, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

**బాబు పాపాలు... ఒక్కొక్కటి బయటికి!**

సీఎం పదవి నాకు కొత్తకాదు... తాను నిప్పు..అని పదేపదే చెప్పుకునే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు కుంభకోణాల పాపాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, శిక్ష అనుభవించక తప్పదని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. రూ.371 కోట్ల స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంకు పాల్పడిన చంద్రబాబు, తనయుడు లోకేష్ ఇష్టారాజ్యంగా సీఎం వైఎస్ జగన్‌తోపాటు ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు అతిపెద్ద ఆర్థిక నేరగాడని, ఇలాంటి వ్యక్తి ప్రజాక్షేత్రంలో ఉండడానికి అనర్హుడు అని స్పష్టం చేశారు. ఈయనను అండమాన్ జైళ్లలోనే జీవితాంతం ఉండేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కాటసాని కోరారు.

## ప్రజాధనాన్ని లూటీ చేసిన నారా చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చే స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో చంద్రబాబు రూ.371 కోట్ల ప్రజా ధనాన్ని లూటీ చేశారని, అడ్డంగా దొరికిపోయాడని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ఆరోపించారు. శనివారం కొలిమిగుండ్లలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబు స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో భారీ స్కాంకు పాల్పడ్డారన్నారు. జీఎస్టీ, ఈడీ, ఇంటిలిజెన్స్, ఐటీ, సెబీ ఇలా ఏజెన్సీలన్నీ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి గుట్టు రట్టు చేశాయన్నారు. ప్రాజెక్ట్ అంచనా వ్యయం రూ.3,356 కోట్లు కాగా ఇందులో ప్రభుత్వ వాటా 10 శాతం మాత్రమే. 90 శాతం సీమెన్స్ కంపెనీ అంటే రూ 3వేల కోట్లు ఇస్తుందని చంద్రబాబు నమ్మబలికాడని ఆరోపించారు. సీమెన్స్ నుంచి రావాల్సిన గ్రాంట్ ఇన్ ఎయిడ్‌గా ఒక్క పైసా రాకుండానే ఐదదఫాలుగా ప్రభుత్వం రూ.371 కోట్లు ఎలా విడుదల చేసిందో చెప్పాల్సిన బాధ్యత బాబుపై ఉందని డిమాండ్ చేశారు. అప్పట్లో ఆర్థిక శాఖ అధికారులు నిలుపుదల చేస్తే చంద్రబాబు ఆదేశాల మేరకు నిధులు విడుదల జరిగిందన్నారు. ప్రాథమికంగా తప్పు చేశారని తేలడంతో సీఐడీ అధికారులు అరెస్ట్ చేశారని, బాబు తప్పు చేసి అడ్డంగా దొరికిపోయాడు కాబట్టే టీడీపీ నాయకులు పెద్దగా స్పందించలేదన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనన్న విషయాన్ని టీడీపీ నాయకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు శివరామసుబ్బారెడ్డి, యాతం సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అతిపెద్ద ఆర్థిక నేరగాడు చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు

డోన్: దేశంలోనే అతి ప్రమాదకరమైన అతిపెద్ద ఆర్థిక నేరగాడు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడేనని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ఆరోపించారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ స్వగృహంలో శనివారం ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిమెన్స్ సంస్థతో యువత స్కిల్ డవలప్‌మెంట్ కోసం ఒప్పందం చేసుకున్నానని కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని కొల్లగొట్టి బినామీల బ్యాంక్ ఖాతాలకు తరలించిన విషయాన్ని కేంద్ర నిఘా సంస్థలైన ఐటీ, జీఎస్టీ శాఖలు మహారాష్ట్రలోని పూణాలోని షెల్ కంపెనీలపై దాడులు చేయడంతో అసలు విషయం బట్టబయలైందని, బాబు అవినీతి గుట్టు రట్టు అయ్యిందని విమర్శించారు. బాబుకు సైతం అసలు విషయం తెలుసని, తన అరెస్ట్ తప్పదని భావించే ఆ నెపాన్ని రాష్ట్ర ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై నెట్టేందుకు రాష్ట్ర పర్యటన చేపడుతూ అసత్య ప్రచారానికి తెరలేపారన్నారు.

**బాబు... సత్య హరిశ్చంద్రుడా?**

రాష్ట్రాన్ని 14 ఏళ్ల పరిపాలించానని గొప్పలు చెప్పుకుంటున్న నారా చంద్రబాబునాయుడు నిజస్వరూపం బయటపడిందని శ్రీరాములు, రాజశేఖర్‌రెడ్డి చెప్పారు. అనేక కేసులలో తనపై విచారణ జరపకుండా కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్న చంద్రబాబు సత్య హరిశ్చంద్రుడేమీ కాదని, కేంద్ర సంస్థలే ఈ విషయాన్ని తేల్చాయన్నారు. ఆది నుంచి చంద్రబాబు నైజం కుట్రలు, కుతంత్రాలతో నిండి ఉందని, అధికారం కోసం ఏ అడ్డదారిలోనైనా వెళ్తారనే విషయం పిల్లనిచ్చిన మామను వెన్నుపోటు పొడిచినప్పుడే రాష్ట్ర ప్రజలందరికీ అర్థమైందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ నాయుడు, జిల్లా కార్యదర్శి పోస్టుప్రసాద్, నాయకులు మల్యాల భాస్కర్‌రెడ్డి, దినేష్‌గౌడ్, వెంకోబరావు, కటిక వేణు, కురుకుంద హరి, ఎద్దుపెంట క్రిష్టారెడ్డి, ఆర్‌ఈ రాజవర్ధన్, కుమ్మరి రాజు పాల్గొన్నారు.

### చంద్రబాబు శిక్షార్హుడే

అవుకు: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన అవినీతి పుట్ట పగిలిందని, బాబు ముమ్మాటికే శిక్షార్హుడేనని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి స్పష్టం చేశారు. బాబు అరెస్టు నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా చేసిన కాలంలో ప్రభుత్వం ఇచ్చిన జీఓ ఒక రకంగా ఉంటే అమలు తీరు మరోరకంగా జరిగిందన్నారు. అనేక షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి ప్రజాధనం రూ.371 కోట్లను వివిధ మార్గాల ద్వారా మళ్లించి చంద్రబాబు లబ్ధిపొందిన విషయం వందశాతం వాస్తవమేనని తెలిపారు. తాను నిజాయితీ పరుడునని పలుమార్లు కోర్టులను బురిడీ కొట్టించి స్టేలతో పబ్బం గడిపిన బాబు ఆటలు ఇక సాగవని, సాక్ష్యాలతో సహా అధికారులు నిరూపించారని చెప్పారు.

## టీడీపీ మద్దతు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మద్దతుదారులతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: మండలంలోని చిన్నరాజుపాళెంతాండ గ్రామానికి చెందిన పది టీడీపీ మద్దతు కుటుంబాలు ఆ పార్టీని వీడీ శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నరాజుపాళెం తాండ గ్రామానికి చెందిన బి బాలనాయక్, ఆర్ గోవింద్‌నాయక్, గౌండా బాలునాయక్, వెంకటేష్ నాయక్, రామోజీ నాయక్, బాలోజీనాయక్, కృష్ణనాయక్, సుబ్బరాయుడు నాయక్, చంద్రనాయక్‌లకు ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్‌సీపీ కండువేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పార్టీలు, కులాలు మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందజేస్తుండడంతో టీడీపీ వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఉపాధ్యక్షులు జనార్దన్‌రెడ్డి, పసుపల సర్పంచ్ మోహన్‌బాబు, ఈశ్వర్‌నాయక్, బాలక్రిష్ణ, రమేష్‌నాయక్, సుబ్బానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పక్కగా భూముల హద్దుల ఏర్పాటు



జిల్లెల్లలో పొలాల హద్దుల రాళ్ల ఏర్పాటును పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

బనగానపల్లెరూరల్: మండలంలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష పథకం కింద మొదటి విడత ఎంపికైన గ్రామాల్లో భూసర్వే పూర్తయింది. ఈ మేరకు శనివారం మండలంలోని జిల్లెల్ల గ్రామంలో తహసీల్దార్ శ్రీనివాసులు పర్యటించి రైతుల పొలాల హద్దులను గుర్తించే రాళ్ల ఏర్పాటు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొదటి విడత కింద పండ్లాపురం, బత్తులూరుపాడు, జిల్లెల్ల, మిట్టపల్లె, మీరాపురం, సంకలాపురం, నిలువుగండ్ల జమ్ములదిన్నె గ్రామాల్లో వంద శాతం రీసర్వే పూర్తయిందన్నారు. రైతుల అంగీకారం మేరకు వారి పొలాలను గుర్తించేందుకు హద్దు రాళ్లను నాటు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లె సురేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేడు గుండ్లశింగవరానికి ఎమ్మెల్యే కాటసాని రాక

అవుకు: మండల పరిధిలోని గుండ్లశింగవరం గ్రామానికి ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వస్తున్నట్లు అవుకు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి శనివారం తెలిపారు. రూ.1.76 కోట్లతో పునః నిర్మాణం చేపట్టనున్న అతి పురాతన రంగనాయకుల దేవాలయానికి ఎమ్మెల్యే భూమి పూజ చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## ఆకట్టుకుంటున్న ఊరువాకిళ్లు!



సీతారామపురంలో నిర్మించిన ఊరవాకిలి



శంకలాపురం గ్రామంలో నిర్మించిన ఊరవాకిలి



గూటుపల్లెకు వెళ్లే దారిలో నిర్మించిన ముఖద్వారం

బేతంచెర్ల: ఊరు వాకిళ్లు ఆకట్టుకుంటున్నాయి. పురాతన పద్ధతుల్లో నిర్మించిన కట్టడాలు ప్రతిఒక్కరినీ ఆకర్షిస్తున్నాయి. రాజుల కాలంలో నిర్మించిన కట్టడాలు శిథిలమయ్యాయి. అయితే అదేరీతిలో నిర్మిస్తున్న ప్రస్తుత కట్టడాలు సైతం గ్రామాలకు అందం చేకూర్చుతున్నాయి. మండలంలోని శంకలాపురం, సీతారామపురం, గూటుపల్లె గ్రామాలకు ముందు భాగన దాతల సహకారంతో ఊరువాకిలి, ముఖద్వారం నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి. శంకలాపురం గ్రామంలో శివపార్వతుల విగ్రహాలను ఉంచి ఊరవాకిలి నిర్మించారు. అలాగే సీతారామపురం గ్రామంలో సీతారాముల విగ్రహాలు ఉంచగా, గూటుపల్లె గ్రామస్తుల ఆరాధ్యదైవమైన పెద్దరాజు స్వామి దర్గాను గుర్తు తెచ్చే ముఖ ద్వారాని నిర్మించారు. మూడు గ్రామాలకు ముందు భాగాన నిర్మించిన ఈ కట్టడాలు పురాతన కట్టడాలను గుర్తు చేస్తున్నాయి. ఆయా గ్రామాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

### లోక్ అదాలత్ కేసులపై
## అప్పీలు ఉండదు



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి కిశోర్‌కుమార్

బనగానపల్లెరూరల్: లోక్‌అదాలత్‌లో పరిష్కారించిన కేసులపై కోర్టులకు అప్పీలు వెళ్లే అవకాశం ఉండదని బనగానపల్లె జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కిశోర్‌కుమార్ తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో మెగాలోక్ అదాలత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఇరువర్గాల కక్షిదారులు తమ అంగీకారంతో కేసులు పరిష్కారించుకోవడం ఉత్తమమన్నారు. ఈ లోక్‌అదాలత్ ద్వారా 84 క్రిమినల్ కేసులు, ఒక చెక్‌బౌన్ కేసు, గృహహింస కేసులో రూ.2.50లక్షలు భరణం చెల్లించేలా ఒక కేసు, నాలుగు టైటిల్ సివిల్ దావా కేసులు, 11 మనీ సివిల్‌దావా కేసులు పరిష్కరించారు. అలాగే 259 సమ్మరీ ట్రైల్ కేసులకుగాను రూ.1,31,800 జరిమానా, తొమ్మిది బీఎస్ఎన్‌కు సంబంధించి రూ.12,798 వినియోగదారులకు చెల్లించగా యూనియన్ బ్యాంకుకు సంబంధించిన మొండిబకాయిలు రూ.12.98లక్షలు రికవరీ చేసినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు ఎం రఘురాంరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి, ఏజీపీ అబ్దుల్‌ఖైర్ తదితర సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## రాజీయే రాజమార్గం

- లోక్ అదాలత్‌లో 366 కేసులు పరిష్కారం



కోవెలకుంట్లలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్

కోవెలకుంట్ల: కక్షిదారులకు రాజీయే రాజమార్గమని న్యాయమూర్తి అబ్దుల్ రహిమాన్ సూచించారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. కోవెలకుంట్ల, సంజామల, రేవనూరు, ఉయ్యాలవాడ, దొర్నిపాడు పోలీస్ స్టేషన్ల పరిధిలో రాజీ నేపథ్యంలో 366 కేసులు పరిష్కరించారు. ఎస్టీసీ కేసులు 262, ఐపీసీ 76, అడ్మిషన్ పది, పీఎల్‌సీ 8, ఎంసీ ఐదు, సివిల్ మూడు, డీవీసీ, ఎస్‌ఐ యాక్ట్‌కు సంబంధించి ఒకటి చొప్పున రాజీకావడంతో కేసులను కొట్టివేశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం జరుగుతుందని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆయా కేసులకు సంబంధించి రూ. 15.58 లక్షలు కోర్టుద్వారా వసూలైంది. కార్యక్రమంలో న్యాయవాదులు మల్లికార్జునరెడ్డి, కాశీంసాహెబ్, నరసింహ, విష్ణు మనోహర్‌రెడ్డి, ఓబులేసు, తిరుపాలు, రాజశేఖర్, శ్రీనివాసులు, నాగేషు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు కక్షదారులు, ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కక్షదారులు రాజీకావడంతో వివిధ రకాల 1,341 కేసులు పరిష్కరించినట్లు మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి తంగమణి తెలిపారు. కక్షిదారులు రాజీకావడంతో 155 కేసులు, క్యాలెండర్ కేసులు 11, సాధారణ కేసులు, విచారణ అర్హత కల్గిన 1,130 కేసులు, ఒరిజినల్ సూట్ కేసులు(సివిల్)13, డిక్రీ అయిన కేసులు 12, ప్రీ లిటిగేషన్‌లో రూ.10 లక్షల విలువ 20 కేసులు పరిష్కరించినట్లు న్యాయమూర్తులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు హనీషా, రాహుల్ అంబేద్కర్, న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మహిళా ఆత్మహత్య



మృతి చెందిన షేక్ హుస్సేన్‌బీ

బనగానపల్లెరూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్‌బీ(58) కడపు నొప్పితో శనివారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాల మేరకు కూలీ పని చేసుకొని జీవనం సాగిస్తున్న షేక్ హుస్సేన్‌బీ కొన్నేళ్లుగా కడపు నొప్పితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉన్న టాయిలెట్ క్లీనర్ మందుతాగి ఆత్మహత్యాయత్నాని పాల్పడగా కుటుంబ సభ్యులు బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కొలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– నంద్యాల ఆర్‌అండ్‌బీ రహదారిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. 108 అంబులెన్స్ సిబ్బంది సమాచారం మేరకు మండలంలోని భీమునిపాడు గ్రామానికి చెందిన యువకుడు నరసింహ కోవెలకుంట్లలో సొంత పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా పట్టణ శివారులోని ముక్కెర పంక్షన్‌హాలు సమీపంలో అదుపు తప్పి కింద పడ్డాడు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108కు సమాచారం ఇవ్వడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.

### టీడీపీ బంద్ విఫలం

డోన్ టౌన్ : టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆ పార్టీ శ్రేణులు చేపట్టిన బంద్ విఫలం అయ్యింది. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన స్కామ్ కేసులో ఐటీ అధికారుల నంద్యాల్లో ఉన్న చంద్రబాబు నాయుడిని అరెస్టు చేసి విజయవాడకు తరలించిన విషయం తెలుసుకోన్న టీడీపీ శ్రేణులు పట్టణంలో బంద్‌కు పిలుపునిచ్చారు. టీడీపీ శ్రేణులు మాత్రం బైకులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. అయితే ప్రజల నుంచి బంద్‌కు స్పందన లేదు. దుకాణం దారులు కూడా వ్యాపార లావాదేవీలు కొనసాగించారు. దీంతో ఉదయం డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు 11 గంటల నుంచి యథావిధిగా సాగాయి. అయితే పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో టీడీపీ శ్రేణులు ప్రజాజీవనానికి ఆటంకం కలిగిస్తుండటంతో పోలీసులు నిరసన కారులను అదుపులోకి తీసుకోని పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

### భక్తిశ్రద్ధలతో వరద పాయసం మహోత్సవం



కొండమీదకు వెళ్తున్న భక్తులు

డోన్ రూరల్ : మండల పరిధిలోని అవులదొడ్డి గ్రామం సమీపంలో వెలసిన శ్రీలక్ష్మీవేంటేశ్వర స్వామి ఆలయ సన్నిధానంలో శనివారం వరద పాయసం మహోత్సవం భక్తిశ్రద్ధతో నిర్వహించారు. కార్యక్రమం ఆలయ ధర్మకర్త అలా మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సాగింది. గ్రామంలో నుంచి కొడంపైకి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ప్రత్యేక పూజుల చేశారు. అనంతరం వరద పాయసం కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## పట్టణంలో వినాయకుల సందడి



పట్టణంలో అమ్మకానికి వచ్చిన వినాయకులు

బేతంచెర్ల: వినాయకుల సందడి మొదలైంది. ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించే వినాయక చవతి పండుగ సందర్భంగా ఆయా గ్రామాలు, పట్టణంలో నిర్వాహకులు, యువకులు విగ్రహాలు ఏర్పాటు కు చందాలు వసూలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. వినాయక విగ్రహాలు అమ్మే వ్యాపారులు ఆయా ప్రాంతాల నుంచి తెచ్చిన చిన్న విగ్రహాల నుంచి పెద్ద విగ్రహాల వరకు అమ్మకానికి ఉంచారు. పట్టణంలోని పాతబస్టాండ్ సమీపాన అమ్మకానికి ఉంచిన వినాయక విగ్రహాలు ఆకట్టుకుంటున్నాయి.